ట్రైడెంట్ కర్మాగారం! అమ్మకానికి

చెరకు రైతులకు రూ. 7.38 కోట్ల బకాయిలు

- రెవెన్యూ రికవరీ యాక్టు ప్రయోగానికి సిద్ధమవుతున్న అధికారులు
- ఇప్పటికే 7(ఏ) నోటీసు అందజేత
- సమాధానమివ్వని యాజమాన్యం
- ఆస్తులు వేలం వేయడానికి ఏర్పాట్లు
- ఈ సీజన్‌లో ప్రారంభం కాని క్రషింగ్


కొత్తూర్(బి) గ్రామంలో ఉన్న ట్రైడెంట్ కర్మాగారం

జహీరాబాద్, జనవరి 10 : రైతులకు బకాయి ఉన్న బిల్లులు చెల్లించకుండా.. అధికారులు ఎన్నిసార్లు నోటీసులు జారీ చేసినా సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ట్రైడెంట్ చక్కెర కర్మాగారంపై కొరడా ఝులిపించడానికి అధికారులు సిద్ధమయ్యారు. జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలో ఉన్న ఫ్యాక్టరీ అమ్మకానికి చక్కెరశాఖ అధికారులు సన్నద్ధమైనట్టు పేర్కొన్నారు. గతేడాది క్రషింగ్‌కు సంబంధించి రైతులకు రూ. 7.38 కోట్లకు పైగా బకాయిలు ఇంకా చెల్లించాల్సి ఉన్నది. బకాయిలు చెల్లించాలని ఇప్పటికే ఏడు నోటీసులు అందజేసినందున ఇక రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తున్నది. పరిశ్రమ ఆస్తులను విక్రయించి ఈ మొత్తం చెల్లించే అవకాశమున్నది.

నాలుగేళ్లుగా ఇదే తీరు

ట్రైడెంట్ ఫ్యాక్టరీ నిర్వహణ నాలుగైదేళ్లుగా గాడితప్పింది. క్రషింగ్ అంతంతమాత్రంగానే కొనసాగుతున్నది. రైతులకు బిల్లుల చెల్లింపుల్లో ప్రతీ సంవత్సరం జాప్యం జరుగుతున్నది. బిల్లుల కోసం రైతులు ఆందోళనలు చేయడం పరిపాటిగా మారింది. ప్రభుత్వం తీవ్రంగా ఒత్తిడి చేస్తేనే విడతల వారీగా చెల్లిస్తున్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం అవలంబిస్తున్న వైఖరిని అధికారులకు ఇబ్బందిగా మారింది. గత సీజన్‌కు సంబంధించిన బిల్లుల చెల్లింపుపై అప్పటి మంత్రులు, కలెక్టర్ జోక్యం చేసుకుని యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో రూ. 80 కోట్ల బకాయిలకు రూ.71 కోట్ల వరకు చెల్లించారు. ఇంకా రూ.7.38 కోట్ల పైచిలుకు ఇవ్వాల్సి ఉన్నది. బకాయిల వసూళ్ల కోసం రెవెన్యూ రికవరీ యాక్టులో భాగంగా ఇప్పటివరకు కర్మాగారానికి 7 నోటీసులను అందజేశామని చక్కెరశాఖ అధికారి రాజశేఖర్ వివరించారు. నిబంధనల ప్రకారం అధికారులు 7 నోటీసులను అందజేయడంతో త్వరలో ఫ్యాక్టరీ ఆస్తులను వేలం వేసి రైతులకు బిల్లులను ఇప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వివరించారు.

చెరకు రైతుల పరిస్థితి అగమ్యగోచరం

జహీరాబాద్ ప్రాంతంలో ప్రతీ సంవత్సరం 25వేల ఎకరాల్లో చెరకు పంట సాగు చేస్తున్నారు. మాజీ మంత్రి బాగారెడ్డి కృషితో 1970లో నిజాంషుగర్స్ పేరుతో ఇక్కడ చక్కెర కర్మాగారం ఏర్పాటు చేశారు. 30 గ్రామాల పరిధితో రోజూ 1,500 టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన కర్మాగారం తరువాత విస్తరిస్తూ పోయారు. నిజాం షుగర్స్‌ను ప్రభుత్వం విక్రయించగా ప్రైవేటు యాజమాన్యంలో పరిశ్రమ కొనసాగుతున్నది. ఏటా 3 లక్షల టన్నుల వరకు క్రషింగ్ చేసేవారు. నాలుగైదేళ్లుగా యాజమాన్యాలు మారుతుండడంతో క్రషింగ్, బిల్లుల చెల్లింపులో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ ఏడాది క్రషింగ్ పూర్తిగా నిలిపేశారు. దీంతో చేతికొచ్చిన చెరకు పంట పొలాల్లోనే ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తప్పనసరి పరిస్థితుల్లో పక్కనే ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలోని కర్మాగారాలకు పంటను తరలిస్తున్నారు. రవాణా ఖర్చు ఎక్కువైనా.. రేటు తక్కువైనా.. కనీసం పెట్టుబడి తిరిగి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

7(ఏ)నోటీసును అందజేశాం

ఈ ఏడాది జహీరాబాద్ ప్రాంతంలో 22 వేల ఎకరాల్లో చెరకు సాగు చేశారు. 8 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. ట్రైడెంట్ కర్మాగారంలో క్రషింగ్ జరుగకపోవడంతో 7 లక్షల టన్నుల పంటను రాష్ట్రంలోని ఇతర కర్మాగారాలకు తరలించే ఏర్పాట్లు చేశాం. గతేడాదికి సంబంధించి రైతులకు చెల్లించాల్సిన బకాయిలను రాబట్టుకునేందుకు నిబంధనల ప్రకారం 7(ఏ) నోటీసును అందజేశాం. త్వరలో రెవెన్యూ రికవరీ యాక్టు ప్రయోగించి బకాయిలు ఇప్పిస్తాం.

-రాజశేఖర్, చక్కెర శాఖ జిల్లా అధికారి



మూతపడిన ట్రైడెంట్ కార్మాగారం, గేటుకు అధికారులు అంటించిన నోటీసులు

చెరకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- బీజేపీ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి

జహీరాబాద్, జనవరి 10: ట్రైడెంట్ యాజమాన్యం నిర్లక్ష్యం ఫలితంగా చెరకు రైతులకు తీరని అన్యాయం జరుగుతున్నదని బీజేపీ రాష్ట్ర నాయకుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి పేర్కొన్నారు. జహీరాబాద్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెండింగ్ బిల్లుల కోసం చెరకు రైతులు, నాయకులు రోడ్డెక్కి ఆందోళనలు చేసినా ఫలితం దక్కలేదని వాపోయారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని రైతులకు పెండింగ్ బిల్లులు ఇప్పించేందుకు కృషిచేయాలని డిమాండ్ చేశారు. వెంటనే బిల్లులు చెల్లించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో రైతులు, నాయకులతో కలిసి మరో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. శాసన సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలో భాగంగా రైతుబంధు డబ్బులు జమ చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వం కొలువుదీరి నెల దాటినా ఇప్పటివరకు రైతుల అకౌంట్లలో రైతుబంధు డబ్బులు జమ చేయలేదని విమర్శించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలో ముగ్గుల పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. పట్టణంలోని 25 వార్డుల్లో మహిళా మోర్చా నాయకులు ఇళ్ల వద్దకే వెళ్లి ముంగిళ్లలో వేసిన రంగవల్లులను పరిశీలించి బహుమతులను అందజేస్తారని తెలిపారు.


సమావేశంలో జైపాల్‌రెడ్డి, నాయకులు

అవకాశమిస్తే ఎంపీగా పోటీ చేస్తా

దేశవ్యాప్తంగా ప్రజలు నరేంద్రమోదీ మరోసారి ప్రధాని కావాలని ఆకాంక్షిస్తున్నారని జైపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ అధిష్ఠానం అవకాశం కల్పిస్తే జహీరాబాద్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీచేసేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఆయనవెంట శ్రీనివాస్‌గౌడ్, నౌబాద్‌జగన్, శ్రీనివాస్‌గుప్తా, వైద్యనాథ్, జ్యోతిపండాల్, అడివన్న, సుధీర్‌బండారీ, విజేందర్‌రెడ్డి, శివాజీరావు, బిచ్చిరెడ్డి, అఫ్సర్‌దిల్దార్, సతీష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వేణు, కార్తీక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పంటల సాగు అంతంతే!

- మందకొడిగా వరి నాట్లు
- ఆరుతడి పంటలదీ అదే తీరు
- సంక్రాంతి అనంతరం ఊపందుకునే అవకాశం


(ఫైల్)

మెదక్, జనవరి 10: యాసంగి పంటల సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటినా జిల్లాలో సాగు పనులు మందకొడిగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు కేవలం 44,762 ఎకరాల్లో మాత్రమే రైతులు వివిధ పంటలను వేసుకున్నారు. ఈ యాసంగి సీజన్‌లో 3,06,437 ఎకరాల విస్తీర్ణంలో రైతులు పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు పంటల ప్రణాళిక రూపొందించారు. 2,86,375 ఎకరాల్లో వరి, 6,597 ఎకరాల్లో జొన్న, 3,705 ఎకరాల్లో మొక్కజొన్న, 388 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, 5,305 ఎకరాల్లో కూరగాయల పంటలు, 2,780 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తారని అంచనా వేసింది. డిసెంబరు మొదటి వారంలో ప్రారంభించాల్సిన పంటల సాగు ఈ సీజన్‌లో ఆలస్యం అవుతున్నదని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు వరి నాట్లు 40 వేల ఎకరాల్లో, మొక్కజొన్న 1,878 ఎకరాలు, జొన్న 1,782 ఎకరాలు, పొద్దుతిరుగుడు 50 ఎకరాలు, పెసర 81 ఎకరాలు, శనగ 90 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

సంక్రాంతి అనంతరం జోరుగా నాట్లు

ఈ సంక్రాంతి పండగ అనంతరం జిల్లాలో పంటల సాగు ఊపందుకుంటుందని అంచనా వేస్తున్నారు. వానాకాలం సీజన్ ధాన్యం విక్రయాలు పూర్తికావడం, అందుకు సంబంధించిన డబ్బులు ఖాతాల్లో పడుతుండడంతో రైతులు కాస్త ఆలస్యంగా వరి నాట్లు వేస్తున్నారు. పండగ తర్వాత 10 రోజుల వ్యవధిలో జిల్లావ్యాప్తంగా నాట్లు పూర్తవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మంజీరా ఆయకట్టులో పంటల సాగు కోసం సింగూరు జలాలను శుక్రవారం నుంచి వదులుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. యాసంగి సాగుకు సరిపోయేలా దశలవారీగా నీరు ఘణపురం ప్రాజెక్టుకు వదులుతారు. ప్రాజెక్ట్ పరీవాహక ప్రాంతాలైన మెదక్, హవేళీ ఘనాపూర్, కొల్చారం, పాపన్న పేట మండలాల పరిధిలో సుమారు 25 వేల ఎకరాల పంట పొలాలకు సాగునీరందనుంది. సింగూరు జలాలు వస్తే వరి నాట్లు వేగం అందుకుంటాయని అధికారులు తెలిపారు.

వరి నారుపై చలి ప్రభావం

జిల్లాలో ఈ ఏడాది శీతాకాలంలో అతితక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో పంటల సాగుపై ప్రభావం చూపుతున్నది. చలి ప్రభావంతో వరి నారు ఎదగడంలేదని రైతులు వాపోతున్నారు. డిసెంబరు మాసంలోనే తూకాలు పోసుకున్నా చలి, మంచు కారణంగా నారు ఎదగడం ఆలస్యమవుతున్నది. చలి నుంచి వరి నారును కాపాడుకోవడానికి పాలిథిన్ కవర్లు కప్పాలని అధికారులు సూచిస్తున్నారు. చలి తీవ్రతకు వరి నారుకు తెగుళ్లు సోకే అవకాశం ఉంటుంది. నారు ఎరుపు రంగులోకి మారి చనిపోయే ప్రమాదం నివారించడానికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని లీటరు నీటితో కలిపి చల్లాల్సిందిగా పేర్కొంటున్నారు.


ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు


సినీనటి అనన్యతో సెల్ఫీ దిగుతున్న యువతులు, మహిళలు


ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు వద్ద మహిళలు

ముగ్గుల హరివిల్లు

ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్


ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని


ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి


ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో పోటీదారులు వేసిన ముగ్గులతో ఇంద్రధనస్సు నేలకు దిగి వచ్చిందా అనిపించింది. తెలంగాణవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పోటీలు జరగగా, ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఫైనల్స్‌లో తమ ముగ్గులతో పోటీ పడ్డారు. సినీనటి అనన్య నాగళ్ల, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినితో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సినీనటి అనన్య


ముగ్గులు వేస్తున్న మహిళలు




అతిథులకు స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో చీఫ్ ఉప్పులూరి మురళీకృష్ణ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి


మృతిచెందిన యువకులు


వంశీ(ఫైల్)


లోకేష్(ఫైల్)

సిద్దిపేటరూరల్, జనవరి 10: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. నారాయణరావుపేట మండలం కోదండరావుపల్లి గ్రామానికి చెందిన సల్ల లోకేష్(16), పిండం వంశీ(16) పుట్టినరోజు కోసం కేక్ తీసుకొని సిద్దిపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామానికి చెందిన కుందాల బాలకృష్ణ(22) వారి బంధువులైన సిద్దిపేట రూరల్ మండలం పెద్ద లింగారెడ్డిపల్లి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా రాఘవాపూర్ గ్రామ శివారులో బుధవారం రాత్రి వీరి బైకులు అతివేగంగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో లోకేష్, వంశీలు అక్కడికక్కడే మృతిచెందగా బాలకృష్ణ పొదల్లో పడిపోయాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతున్న బాలకృష్ణను 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సిద్దిపేట రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు


బ్రిజేష్ గోస్వామి(ఫైల్)

జిన్నారం, జనవరి 10: నాలుగు నెలల క్రితం అదృశ్యమైన వ్యక్తి హత్యకు గురికాగా బొల్లారం పోలీసులు కేసును ఛేదించారు. బొల్లారం సీఐ నయిమోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బ్రిజేష్ గోస్వామి(26) ఉపాధి నిమిత్తం బొల్లారం వచ్చి పోచమ్మ బస్తీలో కుటుంబంతో నివాసముంటున్నాడు. కాగా 2023 ఆగస్టు 8న గోస్వామి అదృశ్యం కాగా.. భార్య ఆర్తిదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అనుమానితులైన రాజన్, అజయ్, సీతు, విజయ్ అదుపులోకి తీసుకుని విచారించగా.. బ్రిజేష్‌ను హత్య చేసి కాజీపల్లి సమీపంలోని రోడ్డు కల్వర్టు కింద పారవేశారని తేలింది. బుధవారం ఘటనా స్థలంలోనే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించామని సీఐ తెలిపారు. స్థలాన్ని ఎస్పీ రూపేష్, డీఎస్పీ పురుషోత్తమ్‌లు పరిశీలించారు.

బెల్ట్‌షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై పోలీసుల దాడులు

సంగారెడ్డి క్రైం, జనవరి 10: పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం ఇంజనీరింగ్ కాలేజీ పరిసర ప్రాంతాల్లో అక్రమంగా నడుపుతున్న బెల్ట్‌షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా బెల్ట్‌షాప్‌లు నడుపుతూ అక్రమంగా మద్యం అమ్ముతున్నారని, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను ఏర్పాటు చేసి వాటిలో ప్రభుత్వం నిషేధించిన సిగరెట్లను అమ్ముతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్పీ చెప్పారు.

'యువత అన్నిరంగాల్లో ముందుండాలి'

సంగారెడ్డి అర్బన్, జనవరి 10: యువత అన్నిరంగాల్లో ముందుండాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. సంగారెడ్డిలోని తారా డిగ్రీ కళాశాలలో జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బుధవారం నేషనల్ యూత్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యువత సమస్యలను అధిగమించి లక్ష్యాన్ని ఛేదించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అశోక్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా సంక్షేమాధికారి సంధ్యారాణి, డీవైఎస్‌వో రాంచందర్‌రావు, తారా కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట శివారులోని రెస్టారెంట్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి


రెస్టారెంట్‌లో టీ తాగుతున్న మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్‌షిండే

పెద్దశంకరంపేట, జనవరి 10: మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి పెద్దశంకరంపేట శివారులోని రెస్టారెంట్‌లో ఆగి టీ సేవించాడు. హైదరాబాద్‌కు వెళ్లే క్రమంలో హైవే 161పై పెద్దశంకరంపేటలోని కింగ్స్-9 రెస్టారెంట్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే టీ తాగడం కోసం ఆగారు. ఆయనతో సెల్ఫీలు దిగేందుకు యువకులు పోటీపడ్డారు. రెస్టారెంట్‌లో ఆయన 15 నిమిషాలు గడిపారు. అల్లాదుర్గం సీఐ జార్జ్, పెద్దశంకరంపేట ఎస్ఐ బాలరాజు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మట్టిలో అనేక మాణిక్యాలు ఉంటాయి

- వాటిని వెతికిపట్టడంలోనే సమాజం విఫలం
- కవి, రచయిత జయరాజు



గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కవి, రచయిత జయరాజు

గజ్వేల్, జనవరి 10: మట్టిలో అనేక మాణిక్యాలు ఉంటాయని వాటిని వెతికిపట్టడంలో సమాజం విఫలమైందని కవి, రచయిత జయరాజు అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో గజ్వేల్ జర్నలిస్టు వెల్ఫేర్ సొసైటీ, ప్రెస్‌క్లబ్ సంయుక్తంగా జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఖాజా విరాహత్‌అలీకి ఆత్మీయ సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజకీయాల్లో సంఘసంస్కర్తలకు, అక్షరానికి, తెలివికి అవకాశం లేదన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం పరిపూర్ణంగా అమలులోకి రాలేదని, అభివృద్ధితో పాటు అనేక విషయాల్లో వెనుకబడి ఉన్నదని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మట్టిలో అనేక మాణిక్యాలు ఉంటాయని, వాటిని వెతికి పట్టడంలోనే సమాజం విఫలమవుతుందన్నారు. అక్షరాల్లో పెరిగిన వ్యక్తి విరాహత్‌అలీ అని, నిత్యం సేవ చేయడంలోనే ఆయన ఆనందాన్ని, సంతృప్తిని పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలోఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, కవి, రచయితలు దరువు అంజన్న, షేక్‌బాబ, జడ్పీటీసీ పంగ మల్లేశం, వైస్ చైర్మన్ జకీయోద్దీన్, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రాంచంద్రం, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధరశర్మ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలీఅహ్మద్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయండి: కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, జనవరి 10: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) లక్ష్యాన్ని పూర్తి చేయాలని రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో రైస్ మిల్లర్లు, అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. రైస్ మిల్లులకు సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని త్వరితగతిన మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి బియ్యం నిల్వలు అందించేలా రైస్ మిల్లర్లు సహకరించాలని, రైస్ మిల్లర్లు సీఎంఆర్‌ను 25 వరకు అందించాలని ఆదేశించారు. సీఎంఆర్ రైస్ డెలివరీ లక్ష్యాన్ని చేసుకోని మిల్లర్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, నిర్ణీత సమయంలోగా అందజేయని వారిపై 6ఏ కింద కేసులు నమోదు చేసి, మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టడమే కాకుండా సీజ్ చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. 2022-23 ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన కమీషన్ 10 రోజుల్లోగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఓటరు జాబితా సవరణలో 2024లో భాగంగా తప్పులు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితాను రూపొందించాలని ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలను కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా 22 వరకు క్లెయిమ్స్, అబ్జెక్షన్స్ స్వీకరించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్పించాలన్నారు. ముఖ్యంగా ఫారం 7, 8ల పరిశీలన పూర్తిచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ నెల 20, 21 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ నిర్వహిస్తున్నామని, ఆయా పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లాలో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నీటి వనరుల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుని వాటిని కాపాడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జహీరాబాద్ ట్రైడెంట్ చక్కెర కర్మాగారం రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో నగేష్‌గౌడ్, పౌరసరఫరాల జిల్లా అధికారి వనజాత, పౌర సరఫరాల శాఖ డీఎం సుగుణబాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రైస్ మిల్లర్లు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు

కంది, జనవరి 10: కేజీబీవీ విద్యార్థినులు గృహహింస, బాల్య వివాహ నిషేధ చట్టం, పోక్సో వరకట్న నిషేధం తదితర చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. కంది మండల పరిధిలోని కాశీపూర్ వద్దనున్న కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం)లో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు ఆదేశాలతో హనుమంతరావు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. బాలికలు ఎవరిపై ఆధారపడకుండా పట్టుదలతో చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. రానున్న పదో తరగతి పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేటట్టు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ సదస్సులో కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరుల పాల్గొన్నారు.



కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు

సంక్రాంతికి ఊరు వెళ్తున్నారా.. జాగ్రత్త!

- కొత్తవారి కదలికలపై సమాచారం అందించాలి
- మెదక్ జిల్లా ఎస్పీ డా.బాలస్వామి

మెదక్ అర్బన్, జనవరి 10: సంక్రాతి పండుగ సెలవులను పురస్కరించుకొని సొంత ప్రాంతాలకు వెళ్లే ఆయా కాలనీ, అపార్టుమెంట్ వాసులు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా ఎస్పీ డా.బాలస్వామి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. సొంత గ్రామాలకు వెళ్లే వారు ఇళ్లల్లో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, డబ్బులు ఉంచవద్దన్నారు. విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో గానీ, లాకర్లు లేని వారు వాటిని తమ బంధువుల ఇళ్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. అదేవిధంగా ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులందరూ ఊరికి ప్రయాణం కట్టిన పరిస్థితుల్లో తెలిసిన వారిని తమ ఇళ్లల్లో రాత్రివేళ పడుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబరును సంబంధిత పోలీస్‌స్టేషన్లలో తెలపాలని పేర్కొన్నారు. ప్రజలు తమ కాలనీలు, ఇళ్ల పరిసరాలు, షాపింగ్ మాళ్లలో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని చెప్పారు. అనుమానిత వ్యక్తుల కదలికలను గమనించి డయల్ 100, పోలీస్ కంట్రోల్ రూం నెంబర్ 8712657888 సమాచారం ఇవ్వాలన్నారు.



ఎస్పీ డా.బాలస్వామి

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలను సాధించాలి: మెదక్ కలెక్టర్

మెదక్ అర్బన్, జనవరి 10: ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇంటర్ కళాశాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్నాయని, జిల్లాలో ఉన్న 63 కళాశాల విద్యార్థులను ఏబీసీడీ గ్రూపులుగా విభజించి, సీడీ గ్రూప్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. ఈ నెల 1 నుంచి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, స్పెషల్ స్లిప్ టెస్టులు, నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రథమ 6,506 మంది, ద్వితీయ సంవత్సరంలో 6,653 మంది మొత్తం 13,159 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. అనంతరం సబ్జెక్టు కౌన్సిలర్స్ తయారు చేసిన ప్రత్యేక బేసిక్ లెర్నింగ్ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ, ఎస్సీ అభివృద్ధి శాఖాధికారి విజయలక్ష్మి, ప్రిన్సిపల్స్, కౌన్సిలర్స్ అవనీశ్‌రెడ్డి, శశిధర్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీదేవి, కళాశాలల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా











కలలు కనాలి.. వాటిని సాకారం చేసుకోవాలి

- చదువులో క్రమశిక్షణ అవసరం
- విద్యార్థులు ఎక్కడా వెనక్కి తగ్గొద్దు
- సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్

సంగారెడ్డి అర్బన్, జనవరి 10: విద్యార్థులు కలలు కనాలి.. వాటిని సాకారం చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ సూచించారు. సంగారెడ్డి శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో మూడురోజుల పాటు నిర్వహించిన జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ విద్యార్థులు నిద్రపోయే కలలు కనవద్దని, నిద్ర పోనివ్వకుండా చేసే కలలు కనాలన్నారు. విద్యార్థులు తనకు తాను నమ్మకంగా ఉండాలని, నమ్మకం లేకపోతే ఏమీ చేయలేమన్నారు. మనలో ఎంత శక్తి ఉందో అది మనకే తెలుసని పేర్కొన్నారు. చదువులో క్రమశిక్షణ ఉండాలని సూచించారు. విద్యార్థులు ఎక్కడా వెనక్కి తగ్గకుండా అన్నిరంగాల్లో రాణించాలన్నారు. తాను 15 ఏళ్ల కిందటే రూపేష్ ఐఏఎస్ అని తన డైరీలో రాసుకున్నానని, చివరికి ఐపీఎస్ అయ్యానని చెప్పారు. అందుకే లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఒక చిన్న ఐడియా జీవితాన్ని మార్చేస్తుందని, అందులో ప్రతి ఒక్కరూ ఐడియాలజీని అలవర్చుకోవాలన్నారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహం వల్లే విద్యార్థులు ఈ ప్రదర్శనకు వచ్చారని ఉపాధ్యాయులను మర్చిపోవద్దని సూచించారు. అనంతరం జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో 782 ఎగ్జిబిట్లు ప్రదర్శించగా, అందులో చివరగా ప్రాథమికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాల నుంచి ఒక్కోటి చొప్పున 11 ఎగ్జిబిట్లు రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఎంపికైన ఎగ్జిబిట్ విద్యార్థి, గైడ్ టీచర్లకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, ఏడీ శంకర్, జిల్లా సైన్స్ అధికారి విజయకుమార్, మీడియా కన్వీనర్ జాకీర్‌హుస్సేన్, ఎంఈవోలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన ఎగ్జిబిట్ విద్యార్థులతో ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

గంజాయి మొక్కలు ధ్వంసం



ధ్వంసం చేసిన గంజాయి మొక్కలు

కోహెడ, జనవరి 10: కోహెడ మండలంలో గంజాయి మొక్కలు పెంచుతున్న ఇంటిపై ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడిచేసి ధ్వంసం చేశారు. హుస్నాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కోహెడ మండలం ఆరెపల్లి గ్రామపంచాయతీ చంద్రనాయక్‌తండాలో బానోత్ కోమలి ఇంటి ఆవరణలో 26 గంజాయి మొక్కలు పెంచారు. పక్కా సమాచారం మేరకు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐలు, సిబ్బంది సంయుక్తంగా కోమలి ఇంటిలో సోదాలు నిర్వహించారు. ఇంటి ఆవరణలో 26 గంజాయి మొక్కలతో పాటు ఇంటి ముందు 240 గ్రాముల ఎండు గంజాయి లభించింది. దీంతో కోమలితో పాటు మనుమడు బానోత్ గణేష్‌పై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. వారిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తామని తెలిపారు. తనిఖీలో సీఐలు కే.శ్రీధర్, పవన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పురుగు పట్టిన పప్పు



పురుగు పట్టిన కందిపప్పు ప్యాకెట్

జగదేవ్‌పూర్, జనవరి 10: గజ్వేల్ సెక్టార్ పరిధిలోని వర్గల్, జగదేవ్‌పూర్, ములుగు, గజ్వేల్, మర్కూక్ మండలాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతినెల పప్పును, పాలను సరఫరా చేస్తున్నారు. గతంలో ప్రభుత్వమే అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు, పాలు పంపిణీ చేసేది. కానీ కొన్నినెలల నుంచి కాంట్రాక్టర్ పంపిణీ చేస్తున్నారు. రెండు నెలల క్రితం సదరు కాంట్రాక్టర్ పురుగులు పట్టిన కిలో కంది పప్పు ప్యాకెట్లు సరఫరా చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులు ఆ పప్పు బాగాలేదని, తినలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పురుగులు పట్టిన పప్పును పక్కన పెట్టి పాత స్టాక్ ఉన్న పప్పునే వండుతున్నామని అంగన్‌వాడీ టీచర్లు చెబుతున్నారు. రెండు నెలలు గడుస్తున్నా పురుగులు పట్టిన పప్పును కాంట్రాక్టర్ తీసుకెళ్లకపోవడంతో కేంద్రాల్లోనే నిల్వ ఉంటుందన్నారు. అధికారులు స్పందించి శుభ్రమైన కందిపప్పును సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కల్లుగీత కార్మికులకు పింఛన్లు మంజూరు చేయండి

సంగారెడ్డి రూరల్, జనవరి 10: ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకున్న కల్లుగీత కార్మికులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆశన్నగౌడ్, రమేష్‌గౌడ్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సంగారెడ్డిలో కలెక్టర్ క్రాంతికి వినతిపత్రం అందజేసి వారు మాట్లాడారు. జిల్లాలో 50 ఏళ్లకు పైబడిన అనేకమంది కల్లుగీత కార్మికులు పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వారికి ఎక్సైజ్ అధికారులు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడంతో వారి దరఖాస్తులను తిరస్కరించే అవకాశం ఉన్నదని తెలిపారు. జిల్లా ఎక్సైజ్‌శాఖ నుంచి గీత కార్మికులందరికీ గుర్తింపు కార్డులు జారీ చేయాలని, అర్హులైన వారందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కేజీకేఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కృష్ణాగౌడ్ పాల్గొన్నారు.

డీఎల్‌డీఏ ఉమ్మడి జిల్లా ఈవోగా రాంజీ



డీఎల్‌డీఏ ఉమ్మడి జిల్లా ఈవోగా బాధ్యతలు స్వీకరించిన రాంజీని సన్మానిస్తున్న గోపాలమిత్రలు

మెదక్ అర్బన్, జనవరి 10: జిల్లా పశుగణాభివృద్ధి సంఘం(డీఎల్‌డీఏ)గా డాక్టర్ రాంజీ బుధవారం జిల్లా కేంద్రంలోని ఉమ్మడి జిల్లా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈవోగా పనిచేసిన డా.కొండల్‌రెడ్డి సిద్దిపేట జిల్లా జేడీ కార్యాలయ వెటర్నరీ ఏడీగా బదిలీ అయ్యారు. ఆరునెలల కింద డా.రాంజీ ఆదిలాబాద్ జిల్లాకు సాధారణ బదిలీపై వెళ్లగా.. తిరిగి మెదక్ ఉమ్మడి జిల్లా డీఎల్‌డీఏ ఈవోగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంపద పెంపు కోసం గోపాలమిత్రలు కృషి చేయాలన్నారు. మేలు జాతి పశువుల ఉత్పత్తికి.. కృత్రిమ గర్భధారణ ఎంతో దోహదపడుతుందన్నారు. పాడి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అనంతరం రాంజీని గోపాలమిత్రలు శాలువాతో సన్మానించారు.

యువజన ఉత్సవాలకు సిద్దిపేట విద్యార్థి



డేవిడ్‌ను సత్కరిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్‌రావు

సిద్దిపేట క్రైం, జనవరి 10: మహారాష్ట్రలోని నాసిక్‌లో ఈనెల 12 నుంచి 16 వరకు జరిగే యువజన ఉత్సవాలకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్-1 నుంచి బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి డేవిడ్ ఎంపికయ్యాడు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా జరిగే ఈ ఉత్సవాలకు డేవిడ్ ఎంపిక కావడం సంతోషమని ప్రిన్సిపాల్ సీహెచ్.ప్రసాద్ తెలిపారు. డేవిడ్‌ను పుష్పగుచ్ఛంతో సత్కరించి, అభినందించారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి నలుగురు ఎంపిక కాగా.. అందులో డేవిడ్ ఉండడం విశేషమన్నారు. కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సీహెచ్.మధుసూదన్, డాక్టర్ పల్లవి, డాక్టర్ మహేందర్, డాక్టర్ శ్రద్ధానందం, డాక్టర్ రాణి, కృష్ణయ్య పాల్గొన్నారు.

వైభవంగా మూల మహోత్సవం

వర్గల్, జనవరి 10: వర్గల్ విద్యాధరి క్షేత్రంలో మూల మహోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. విద్యా సరస్వతీ అమ్మవారి జన్మనక్షత్రమైన మూల నక్షత్రం సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం విద్యా సరస్వతీ అమ్మవారికి విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పూజల అనంతరం విద్యాసరస్వతీ అమ్మవారికి లక్ష పుష్పార్చన, యాగశాలలో చండీహోమం నిర్వహించారు. విద్యా సరస్వతీ అమ్మవారితో పాటు క్షేత్రంలోని ఉప ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. వేడుకల సందర్భంగా విద్యాధరి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ రసాభాస

- ప్రొటోకాల్ విషయమై కాంగ్రెస్-బీఆర్ఎస్ మాటల యుద్ధం
- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఏ అధికారంతో సభలో పాల్గొంటారని నిలదీసిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- జగ్గారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు బీఆర్ఎస్ ప్రొటోకాల్ పాటించిందా? అని కాంగ్రెస్ శ్రేణుల కౌంటర్



సదాశివపేటలో ఎమ్మెల్యే ప్రభాకర్, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి ఎదుటే తిట్టుకుంటున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు

సదాశివపేట, జనవరి 10: సదాశివపేట పట్టణంలోని ఐబీ విశ్రాంతి గృహం ఆవరణలో బుధవారం నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తూర్పు నిర్మలాజగ్గారెడ్డి వేదికపై ఆసీనులయ్యారు. సభలో 17వ వార్డు ఎంఐఎం కౌన్సిలర్ షహజాది బేగం కుమారుడు అబ్దుల్ వాజీద్ జున్ను మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కల్యాణలక్ష్మి స్థానంలో రూ.లక్ష నగదు, తులం బంగారం ఇంకెప్పుడు ఇస్తుందని నిర్మలా జగ్గారెడ్డిని ఉద్దేశించి అన్నారు. ఆగ్రహించిన కాంగ్రెస్ కౌన్సిలర్లు మీ అమ్మ గారు కౌన్సిలర్ అయితే నీవెలా అడుగుతావని నిలదీశారు. వెంటనే బీఆర్ఎస్ కౌన్సిలర్లు కలుగజేసుకుని నిర్మలాజగ్గారెడ్డి ఏ అధికారంతో సమావేశంలో కుర్చీపై కూర్చుంటారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి ప్రొటోకాల్ విషయంలో ఏపాటి గౌరవం ఇచ్చారో తాము కూడా అంతే గౌరవిస్తామని కాంగ్రెస్ నేతలు అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నది కాబట్టి ప్రతీ అధికారిక కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పాల్గొంటుందని కాంగ్రెస్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు బదులిచ్చారు. కాంగ్రెస్ సభ్యతా, సంస్కారాలను మరిచి ప్రవర్తిస్తుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వర్గీయులు మండిపడడంతో ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం నెలకొంది. ఆ తర్వాత బీఆర్ఎస్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆర్.శ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్ కౌన్సిలర్ లక్ష్మీప్రసన్న భర్త శంకర్‌గౌడ్‌ల మధ్య చోటుచేసుకున్న ప్రొటోకాల్ గొడవ చివరకు అసభ్య పదజాలంతో ఒకరినొకరు తిట్టుకునే స్థాయికి చేరింది. దీంతో ఆయా పార్టీల ప్రతినిధుల అనుచరులు, కార్యకర్తలు పరస్పర దూషణలు, విమర్శలు చేసుకున్నారు. అదే సమయంలో నిర్మలాజగ్గారెడ్డి మైక్ లాక్కుని మాట్లాడుతూ.. "మేము మీలా మాట తప్పి పేదలకు, దళితులకు, మైనార్టీలకు, మూడెకరాల భూమి, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, 12శాతం రిజర్వేషన్లు, మైనార్టీ బంధు, బీసీబంధు ఇవ్వకుండా మొహం చాటెయ్యలేదు" అని అన్నారు. పథకాల అమలులో అక్రమాలకు పాల్పడలేదన్నారు. సాగు-తాగునీటి ప్రాజెక్టుల్లో రూ.లక్షల కోట్ల ప్రజాధనం లూటీ చేయలేదన్నారు. 10ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ఆశయాలు నెరవేరకపోగా రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బొందపెట్టి ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని విమర్శించారు.



సంగారెడ్డిలో చెక్కులను పంపిణీ చేస్తున్న నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డిలోనూ ప్రొటోకాల్ రగడ

- డీసీసీ అధ్యక్షురాలికే ప్రాధాన్యమిస్తున్నారని అసహనంతో వెళ్లిపోయిన ఎమ్మెల్యే

సంగారెడ్డి టౌన్, జనవరి 10: సంగారెడ్డిలోని టీఎన్‌జీవో భవనంలో రెవెన్యూ అధికారులు బుధవారం నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలోనూ ప్రొటోకాల్ రగడ రాజుకున్నది. కార్యక్రమానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డిని అధికారులు ఆహ్వానించారు. నిర్ణీత ఉదయం 11గంటల సమయానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హాజరయ్యారు. డీసీసీ అధ్యక్షురాలు వచ్చే వరకు చెక్కుల పంపిణీ చేయవద్దని కాంగ్రెస్ నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకు డీసీసీ అధ్యక్షురాలు రాకపోయినా అధికారులు చెక్కుల పంపిణీ చేపట్టలేదు. దీంతో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అసహనంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. తర్వాత డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి రాగానే చెక్కులు పంపిణీ చేశారు.

అత్యుత్సాహం తగ్గిస్తే మంచిది: ఎమ్మెల్యే



అధికారంలోకి రాగానే కాంగ్రెస్ నాయకులు కొందరు అత్యుత్సాహం ప్రదర్శించి తామంతటి గొప్పవాళ్లు ఎవరూ లేరని విర్రవీగిపోవడం మంచిది కాదని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హితవు పలికారు. ఎమ్మెల్యేగా ఓటమి చెందిన జగ్గారెడ్డి ఇక తనకు ప్రజలతో అవసరం లేదన్నట్టుగా తన భావాలను మీడియా సాక్షిగా చెప్పడం కాంగ్రెస్ నాయకులు గమనించాలన్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో ఎమ్మెల్యేగా ఉండి నియోజకవర్గ ప్రజలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు అందుబాటులో లేరని చెప్పారు. తన నాయకత్వ లక్షణాలు ఏమిటో? జగ్గారెడ్డి నాయకత్వ లక్షణాలు ఏమిటో నియోజకవర్గ ప్రజలకు తెలుసునన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో ప్రొటోకాల్ ఉల్లంఘనకు పాల్పడుతున్న అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. జగ్గారెడ్డి సతీమణి, డీసీసీ అధ్యక్షురాలు ప్రొటోకాల్‌ను ఉల్లంఘిస్తూ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం సిగ్గుచేటన్నారు.

సంగారెడ్డి డీసీసీని ప్రక్షాళన చేయాలి



కందిలో మాట్లాడుతున్న ఎంఏ మక్బుల్

కంది, జనవరి 10: సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీని ప్రక్షాళన చేసి, పూర్తి స్థాయిలో కమిటీని ఏర్పాటు చేయాలని జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఎంఏ మక్బుల్ డిమాండ్ చేశారు. కందిలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు రాకపోవడానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి కారణమని ఆరోపించారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జగ్గారెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు పార్టీని పట్టించుకోకపోవడం శోచనీయమని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కమిటీని తిరిగి ఏర్పాటు చేయాలని మక్బుల్ కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రఘురాంరెడ్డి, యూసుఫ్‌ఖాన్, ఇమ్రాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పాత కక్షలతో ఉప సర్పంచ్‌పై దాడి

కంది, జనవరి 10: పాత కక్షలతో ఉప సర్పంచ్‌పై దాడికి పాల్పడిన సంఘటన మండలపరిధిలోని బ్యాతోల్ గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకున్నది. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. కంది బ్యాతోల్ ఉప సర్పంచ్ అశోక్‌గౌడ్ ఇంటివద్దకు మంగళవారం రాత్రి 10గంటల సమయంలో గ్రామానికి చెందిన పదిమంది వెళ్లి, దాడికి పాల్పడ్డారు. భయభ్రాంతులకు గురైన అశోక్‌గౌడ్ బుధవారం ఉదయం సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 10 మందిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్కూల్, అంగన్‌వాడీల నిర్వహణపై ఎంపీపీ ఆగ్రహం



అంగన్‌వాడీ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ స్వరూప

వెల్దుర్తి, జనవరి 10: మండలంలోని మెల్లూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణపై ఎంపీపీ స్వరూప ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మెల్లూరులో ఆమె పర్యటించారు. పాఠశాలలోని తరగతి గదుల కిటికీలను మూసివేసి చీకట్లో బోధన చేయడంపై హెచ్ఎం వెంకట్‌రెడ్డిపై మండిపడ్డారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ తక్కువగా ఉన్నదని, వచ్చే సంవత్సరం సంఖ్యను పెంచాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థుల అటెండెన్స్ రిజిస్టర్‌ను ఎంపీపీ పరిశీలించారు. విద్యార్థుల అటెండెన్స్‌కు, స్టాక్ రిజిస్టర్‌లో ఉన్న వివరాలకు, కేంద్రంలో నిల్వ ఉన్న సరుకుల మధ్య తేడా ఉండడంతో అంగన్‌వాడీ టీచర్ సుభాషిణిని నిలదీశారు. సరుకులు పక్కదారి పట్టడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ హెచ్చరించారు. పెద్దపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీపీ తనిఖీ చేశారు. ఆమెవెంట వైస్‌ఎంపీపీ సుధాకర్‌గౌడ్, ఎంపీవో విఘ్నేశ్వర్ ఉన్నారు.

గుండెపోటుతో వీఆర్ఏ మృతి

మనోహరాబాద్, జనవరి 10: మనోహరాబాద్‌కు చెందిన వీఆర్ఏ తాడెం లక్ష్మీ(40) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆమెకు కుమారుడు అనంద్, కూతురు సరళ ఉన్నారు. వీఆర్ఏ మృతిపట్ల పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఉపాధి హామీ పనులపై ప్రజాదర్బార్

- పలు గ్రామాల్లో నిర్వహించిన అధికారులు
- నారాయణఖేడ్‌లో హాజరైన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జనవరి 10: నారాయణఖేడ్‌లో బుధవారం 13వ విడత ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజా దర్బార్‌ను నిర్వహించారు. తాము చేసిన పనులకు సక్రమంగా బిల్లులు అందలేదని, తమకు న్యాయం చేయాలని పలువురు కూలీలు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. పనులను నాణ్యతగా నిర్వహించినప్పుడే ప్రజల జీవన గమనం మరింత పెరుగుతుందన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు పారదర్శకతతో నాణ్యతగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్‌రావు, ఎంపీపీ చాందిబాయి చౌహాన్, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, సేవాలాల్‌సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ పాల్గొన్నారు.

కంగ్టిలో తూతూ మంత్రంగా ప్రజాదర్బార్

కంగ్టి: కంగ్టిలో బుధవారం చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రజలు లేకుండానే కొనసాగింది. 2023-2024 సంవత్సరానికి గాను మండలంలోని 34 గ్రామాల్లో చేపట్టిన పనులపై సిబ్బంది వారం రోజుల పాటు సామాజిక తనిఖీ చేపట్టారు. తనిఖీలో వెలుగు చూసిన అవినీతి, అక్రమాలు, అభివృద్ధిపనులపై ప్రజాప్రతినిధులు, కూలీలు, ప్రజల సమక్షంలో ప్రజా దర్బార్ చేపట్టవలసి ఉంటుంది. కానీ కంగ్టిలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు కేవలం పంచాయతీల కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్రసహాయకులు మాత్రమే హాజరయ్యారు. 60నుంచి 70 మంది వరకు ప్రభుత్వ అధికారులే కనిపించారు. పట్టుమని పదిమంది కూలీలు, ఒక్క ప్రజాప్రతినిధిగాని కనిపించకపోవడం గమనార్హం. ప్రజాదర్బార్ విషయమై ప్రజలకు, కూలీలకు అధికారులు సరైన సమాచారం ఇవ్వలేదనే విమర్శలొస్తున్నాయి. సమావేశంలో జిల్లా అడిషనల్ పీడీ వామన్‌రావు, ఏపీడీ రాజు, ప్లాంటేషన్ మేనేజర్ మనికుమార్, ఎస్ఆర్‌పి శ్రీనివాస్, ఏపీవో నర్సింహులు, బస్వరాజ్, ఎంపీడీవో ముజాఫ రోద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో

రామాయంపేట: రామాయంపేట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో డీఆర్‌డీవో శ్రీనివాస్ నేతృత్వంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏల నుంచి రూ.83 వేల రికవరీతో పాటు రూ.17 వేల జరిమానా విధించారు. ఈ ఏడాదిలో రూ.7కోట్ల 75 లక్షల మేర ఉపాధి పనులు జరుగగా.. డీఆర్‌పీల సర్వేలో అవకతవకలు జరిగినట్లు వెల్లడైంది. దీంతో సదరు సిబ్బంది నుంచి ఆడిట్‌లో నగదు రూపంలో కట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీవో విరోజరాణి, ఏపీవో శంకర్, ఎంపీడీవో ఉమాదేవి, ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు, కూలీలు పాల్గొన్నారు.



కంగ్టిలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న అధికారులు

విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టాలి

- సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్

జహీరాబాద్, జనవరి 10: సంక్షేమ గురుకులాల్లో విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టాలని సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల మరణాల పరంపర కొనసాగుతున్నదన్నారు. ఇటీవల కాలంలో జిల్లా వ్యాప్తంగా ఆయా గురుకుల పాఠశాలల్లో ఐదుగురు విద్యార్థులు వివిధ కారణాలతో చనిపోయారని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు జరిగిన ఆత్మహత్యలపై ప్రభుత్వం సమగ్రవిచారణ చేపట్టి ఆయా కుటుంబాలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

'హైకోర్టుకు భూములు ఇవ్వొద్దు'

మెదక్ అర్బన్, జనవరి 10: వ్యవసాయ ఉద్యాన యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించవద్దని ఏబీవీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం మెదక్‌లో ఆయన మాట్లాడుతూ.. రైతులకు నష్టాలు రాకుండా పండించే ప్రతి పంటకు లాభం వచ్చే విధంగా నూతన వంగడాలు, విత్తనాలపై పరిశోధనలు, అభివృద్ధి కోసం అగ్రికల్చర్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు భవనాల కోసం కాంగ్రెస్ సర్కార్ జీవో 55తో యూనివర్సిటీలోని దాదాపు 100 ఎకరాల భూమిని ఇచ్చేందుకు సిద్ధమైందని చెప్పారు. ఈ నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వెంటనే జీవో 55ను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉపాధి హామీతో ప్రయోజనం

న్యాల్‌కల్, జనవరి 10: ఉపాధి హామీ పథకం నిరుపేదలకు ప్రయోజనకరంగా మారుతుందని మల్గి సర్పంచ్ మారుతీయాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మల్గి గ్రామంలో 2024కు సంబంధించి ఉపాధి హామీన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో చేపట్టే ఉపాధి పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గ్రామంలో అందరికి పనులను కల్పించే విధంగా అధికారులు చొరవచూపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శివానందశ్రీపతి, ఆత్మ కమిటీ డైరెక్టర్ రాజు, వార్డు సభ్యుడు విఠల్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

గుమ్మడిదల, జనవరి 10: బొంతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ క్యాలెండర్‌ను బుధవారం మండల అకాడమిక్ కోఆర్డినేటర్ రాంబాబు, మండల నోడల్ ఆఫీసర్ పద్మావతి ఆవిష్కరించారు. పీఆర్టీయూ మండలాధ్యక్షుడు కుమార్, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లపై కేంద్ర ప్రభుత్వ జులుం నశించాలి

- జహీరాబాద్‌లో లారీడ్రైవర్ల ఆందోళన

జహీరాబాద్, జనవరి 10: డ్రైవర్లపై కేంద్ర ప్రభుత్వ జులుం నశించాలని లారీడ్రైవర్ల సంఘం అధ్యక్షుడు మహ్మద్ అఫ్సర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఖాజామియ పేర్కొన్నారు. బుధవారం డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జహీరాబాద్‌లో ర్యాలీ తీసి, ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విధించిన నిబంధనలతో డ్రైవర్ల కుటుంబాలు రోడ్లపైకి వచ్చే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రెక్కాడితే తప్ప డొక్కాడని విధంగా డ్రైవర్ల బతుకులు ఉంటాయని, అలాంటివారిపై కేంద్రం జైలు, జరిమానాలను విధించేలా చర్యలు చేపట్టడం తగదన్నారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

తూప్రాన్‌లో

తూప్రాన్: హిట్ అండ్ రన్ పేరుతో కేంద్రం తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత చట్టాన్ని నిరసిస్తూ తూప్రాన్‌లో లారీల డ్రైవర్లు బుధవారం ఆందోళన చేపట్టారు. తూప్రాన్ పట్టణ శివారులోని అల్లాపూర్ చౌరస్తా వద్ద తూప్రాన్ - గజ్వేల్ రోడ్డుపై లారీలను నిలిపి నిరసన తెలిపారు. ఆందోళనలో భాగంగా సమ్మెను చేపట్టారు. కార్యక్రమంలో తూప్రాన్ మండల లారీ డ్రైవర్ల అసోసియేషన్ అధ్యక్షుడు రోషన్ అలీ, ఉపాధ్యక్షుడు షాదుల్లా, ప్రధానకార్యదర్శి శివకుమార్, జాయింట్ సెక్రటరీ మహేష్, కోశాధికారి శ్రీనివాస్, సభ్యులు ప్రసాద్, గోపాల్ పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో రహదారిపై ర్యాలీ తీస్తున్న డ్రైవర్లు

ఆధార్ కేంద్రాల కోసం వినతి

జిన్నారం, జనవరి 10: జిన్నారంలో ఆధార్ కేంద్రాలు లేక మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సమతా సైనిక్ దళ్ నాయకులు అన్నారు. ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం రెవెన్యూ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ఉన్న రెండు ఆధార్ కేంద్రాలు మూత పడడంతో మండలంలో ఎక్కడ ఆధార్ కేంద్రాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంటనే ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో ఏఐఎస్ఎఫ్ఎడీ నాయకులు స్వామి, వీరేశ్, మల్లేశం, దుర్గేష్, ఆంజనేయులు, అశోక్ తదితరులు ఉన్నారు.

నేడు పాంబండలో విద్యుత్ సరఫరా బంద్

శివ్వంపేట, జనవరి 10: శివ్వంపేట మండలం పాంబండ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్‌శాఖ ఇంజనీర్ దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పాంబండ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

విధులు బహిష్కరించిన ఉద్యోగులు

జహీరాబాద్, జనవరి 10: కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీ ఉద్యోగులను ఆదుకోవాలని కోరుతూ బుధవారం పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయ ఉద్యోగులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ ఉద్యోగులు మాట్లాడుతూ.. ఎల్ఐసీలో అన్ని తరగతుల వారిగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, వేతన సవరణను సత్వరమే చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. నూతన పెన్షన్ విధానంలో భాగంగా ఉద్యోగులందరికీ 14శాతం పెన్షన్‌ను కొనసాగించాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు అశోక్, మాణెన్న, చంటి, నర్సింలు, శ్రీనివాస్, రామక్రిష్ణ, మధు, అలీం, మోహనక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తండాల్లో సమస్యలను పరిష్కరించాలి

నారాయణఖేడ్, జనవరి 10: గిరిజన తండాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని లంబాడ హక్కుల పోరాట సమితి నాయకుడు ప్రకాష్‌రాథోడ్ కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి శరత్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖేడ్ నియోజకవర్గంలోని అనేక తండాలకు రోడ్డు సౌకర్యం లేదని, కొన్ని తండాలకు అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు కూడా వెళ్లలేని పరిస్థితి ఉన్నదని తెలిపారు. అన్ని తండాలకు రోడ్డు సౌకర్యం కల్పించి, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలి

- జిల్లా వ్యవసాయాధికారి గోవిందు

హవేళిఘణపూర్, జనవరి 10: వరిపంట సాగులో రైతులు తగు జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మెదక్ జిల్లా వ్యవసాయాధికారి గోవిందు తెలిపారు. బుధవారం హవేళిఘణపూర్ మండలంలోని శమ్నాపూర్ గ్రామంలో ఆయన పర్యటించి, వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ.. పొలాలను ప్రతిరోజు రైతు పరిశీలించాలని, పంటలో చీడపీడలు ఆశిస్తే వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. అధికారులు సూచించిన మందులను పంటలకు పిచికారి చేయాలన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని రైతులకు సూచించారు. రసాయని ఎరువుల వాడకంతో భూసారం తగ్గుతుందని చెప్పారు. అవసరమైన మేరకే రసాయన ఎరువులను వాడాలని వ్యవసాయాధికారి గోవిందు రైతులకు సూచించారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్, రాజు, రామస్వామి, యాదగిరి, స్వామి, సుధాకర్, తదితరులు ఉన్నారు.



మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, కళాశాలలో సంక్రాంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముగ్గులు వేసి, గొబ్బెమ్మలను పేర్చి పాలు పొంగించారు. హరిదాసు వేషధారణలో బాలిక అందరినీ ఆకట్టుకుంది. ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబర్చిన బాలికలకు బహుమతులు అందజేశారు.
- కల్హేర్/సిర్గాపూర్, జనవరి 10

వీలేకరులపై సర్పంచ్ దురుసు ప్రవర్తన

హత్నూర, జనవరి 10: వార్త సేకరణకు వెళ్లిన విలేకరులపై సర్పంచ్ దురుసుగా ప్రవర్తించడంతో విలేకరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తుర్కలఖానాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఇటీవల ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ వార్తా సేకరణకు విలేకరులు వెంకటేశంగౌడ్, ప్రభాకర్ భిక్షపతి బుధవారం వెళ్లారు. వాటర్ ప్లాంట్ ఫొటోలు తీస్తున్న క్రమంలో వాటర్ ప్లాంట్ యజమాని, గ్రామ సర్పంచ్ చంద్రాగౌడ్ విలేకరుల మొబైల్ ఫోన్ లాక్కుని, దుర్భాషలాడుతూ దాడికి ప్రయత్నించాడు. సర్పంచ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విలేకరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసి కేసు నమోదు చేస్తామని హత్నూర ఎస్ఐ సుభాష్ తెలిపారు. సర్పంచ్ చంద్రాగౌడ్ కూడా విలేకరులపై ఫిర్యాదు చేశాడని ఎస్ఐ తెలిపారు.

కుట్టు మిషన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జనవరి 10: స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బుధవారం నారాయణఖేడ్ ఎంపీపీ సమావేశమందిరంలో జాతీయ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ రాష్ట్ర భవన నిర్మాణ రంగ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు ఎమ్మెల్యే కుట్టు మిషన్లు పంపిణీ చేసి, మాట్లాడారు. మహిళలు స్వయంఉపాధి పథకాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చాందిబాయి అధికారులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ ధ్వంసంపై ఆందోళన

జిన్నారం, జనవరి 10: మంగంపేటలో పరిశ్రమ కోసం టీఎస్ఐఐసీ సేకరించిన స్థలంలో ఉన్న పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ధ్వంసం చేయడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన నాయకులు నరేందర్, వార్డు సభ్యులు బుధవారం ధ్వంసమైన ఆలయాన్ని పరిశీలించారు. ఓ పరిశ్రమ కోసం నాలుగేళ్ల క్రితం స్థలాన్ని కేటాయించగా ఎలాంటి పనులు చేపట్టాలేదని, ఇప్పుడు అక్కడ గల ఆలయాన్ని ధ్వంసం చేయడం తగదన్నారు. ఆలయాన్ని పునరుద్ధరించి, ఇతర స్థలంలో పరిశ్రమను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

నిర్మాణంలో ఉన్న చర్చి కూల్చివేతపై ధర్నా

జిన్నారం, జనవరి 10: బొల్లారంలో నిర్మాణంలో ఉన్న చర్చిని కూల్చివేయగా క్రైస్తవులు ధర్నా నిర్వాహించారు. బుధవారం బొల్లారం 254 సర్వే నంబర్‌లోని హెచ్ఎండీఏ స్థలాల్లో పలు అక్రమ నిర్మాణాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కూల్చి వేశారు. ఇదే స్థలంలో పిల్లర్ల స్థాయిలో నిర్మాణంలో ఉన్న చర్చిని కూడా తొలగించారు. దీంతో క్రైస్తవులు బొల్లారంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేయడంతో గంటన్నర పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళన విరమింపజేశారు. ఇదిలా ఉండగా మండల కేంద్రం జిన్నారంలోనూ అక్రమ కట్టడాలను ఆర్ఐ జయప్రకాష్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు తొలగించారు.

విద్యార్థులకు షూ, బెల్టులు పంపిణీ

తూప్రాన్, జనవరి 10: తూప్రాన్ మండలం మల్కాపూర్ హైస్కూల్‌లో విద్యార్థులకు ఉపసర్పంచు ఆంజనేయులుగౌడ్ షూ, బెల్టు, టై, ఐడీ కార్డులను సమకూర్చారు. బుధవారం జిల్లా విద్యాధికారి రాధాకిషన్ హాజరై విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హెచ్ఎం నడిమెల యాదగిరి అధ్యక్షత వహించగా, తూప్రాన్ ఎస్ఐ శివానందం, ఎంఈవో బుచ్చానాయక్, నోడల్ అధికారి సత్యనారాయణ, సర్పంచ్ మహదేవి నవీన్, ఎంపీటీసీ వెంకటమ్మ, విద్యాకమిటీ చైర్మన్ స్వామి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, జనవరి 10: నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నియోజకవర్గంలోని పలువురు నాయకులతో కలిసి త్వరలో జరుగనున్న ఎంపీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ క్యాడర్‌ను సమాయత్తం చేసే విషయమై చర్చించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఎంపీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో నర్సాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ సత్తా చాటాలని ఆ మేరకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని కేటీఆర్ సూచించినట్లు తెలిపారు.